రేపు బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ గా డాక్టర్ గుడారు జగదీష్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ గా విధులు నిర్వహించిన ఆయన రిటైర్మెంట్ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో తన సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి బర్డ్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ జగదీష్‌ను నియమించింది. ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం 9.15 నిమిషాలకు బాధ్యతలు చేపట్టనున్నారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు..

ప్రజాశక్తి- శాంతిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడురోజుల కుప్పం పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమన్నారు. ఈసందర్భంగా సిఎంకు సాదర వీడ్కోలు లభించింది. కుప్పం నియోజక వర్గం శాంతిపురం మండలం కడపల్లి శివపురం వద్ద నూతనంగా నిర్మించిన సొంతింటి గృహప్రవేశ కార్యక్రమంను విజయవంతంగా ముగించుకొని సోమవారం ఉదయం10.50 గంటలకు సొంతింటి నుండి బయలు దేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసేందుకు వచ్చిన ప్రజానీకానికి అభివాదం చేస్తూ హెలిపాడ్‌కు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. ప్రజల నుండి అందిన వినతులను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ఇందిరా గాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుండి బెంగళూరు ఎయిర్పోర్టుకు ఉదయం 11.20 గంటలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డిఐజీ షిమోషి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్.మునిరత్నం, కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసరాజు, నాయకులు, కార్యకర్తలు సాదర వీడ్కోలు పలికారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకి సాదరంగా వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, జెసి, కడా పీడీ అధికారులు

వినతులను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదనలు ఆపాలి

తొలగించిన మూడు వేల మంది కార్మికులను పనిలోకి తీసుకోవాలి.. సిఐటియు- ఎఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

డిఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్ : విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ప్రతిపాదనలు మానుకోవాలని, తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని కార్మిక సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద సిఐటియు- ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి డిఆర్‌ఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్.నాగరాజులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ప్రక్రియ వేగవంతం చేశారని దాని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కూటమి పార్టీ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధీనంలో నడుపుతామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఎన్నో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మైనింగ్ కేటాయిస్తే అత్యధిక లాభాల్లో నడిచే విశాఖ ఉక్కును ఎందుకు ప్రైవేటీకరణ చేయడానికి పూనుకుంటున్నారని ప్రశ్నించారు. కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కారు చౌకగా వేలాది ఎకరాలను అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని, లక్షలాదిమంది ఆధారపడే విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులందరినీ పనిలోకి తీసుకోవాలని, మెడికల్ చెకప్‌లు వెంటనే ఆపాలని కోరారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం విశాఖ ఉక్కును కాపాడే పద్ధతులో చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సిఐటియు నాయకులు దాసు, చిట్టెమ్మ, ఎఐటియుసి నాయకులు మణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఇవే పరిష్కరించండి..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సచివాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా అర్జీదారులు జిల్లా రెవెన్యూ అధికారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఎస్ఆర్ పురం మండలం ఎఎం పురం పంచాయతీ ఆర్ఆర్ పురంకి చెందిన గ్రామస్తులు తమ గ్రామంలో ప్రతి ఒక్కరికి పశువులు, మేకలు, గొర్రెలు ఉన్నాయని వాటిని కొక్కిరాళ్ళ కొండలో సర్వేనెంబర్ 170లో 18.02 ఎకరాల భూమిలో మేపుకునేవారమని గత 30 రోజులుగా మోతుబరీ రైతు కుటుంబం సర్వేనెంబర్ 170 తమ భూమి అని దౌర్జన్యం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. డిఆర్ఓ పరిశీలించి చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారిని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారు. గంగాధర నెల్లూరు మండలం కుర్మాయిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరి ప్రస్తుతం ఆమెకు వితంతు పెన్షన్ వస్తుందని, కానీ ఆమెకు ఒక చేయి, రెండు కాళ్ళు లేవని వికలాంగుల పింఛన్ ఇప్పించాలని వేడుకుంది. బైరెడ్డిపల్లికి చెందిన ఎం.మునస్వామికి 80 సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు ఎటువంటి పెన్షన్ రావడం లేదని, తాను ఒంటరి వాడినని, తనకు జీవనాధారం కూడా కష్టమవుతుందని పెన్షన్ ఇప్పించగలరని కోరగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ అధికారిని డిఆర్ఓ ఆదేశించారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఓ మోహన్ కుమార్

పిజిఆర్ఎస్‌కు 266 అర్జీలు

సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్ఓతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 266 అర్జీలు అందగా శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ, సర్వే శాఖకు 204, పోలీసు శాఖ 15, పంచాయతీరాజ్ 4, డిఆర్‌డిఏ 18, విద్యుత్ శాఖ 7, విద్యాశాఖ 2, దేవదాయ శాఖ 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, నీటి వనరుల శాఖ 2, గురుకులం 1, ఎంపీడీఓ పెనుమూరు 1, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ 2, పౌరసరఫరాల శాఖ 7 ఫిర్యాదులు అందాయి.

నగర పాలక కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు నాలుగు సమస్యలు అందాయి. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ఇంజనీరింగ్ 2, ఫించన్లు 2 చొప్పున మొత్తం నాలుగు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: సొంతింటి గృహప్రవేశ నిమిత్తం శనివారం కుప్పం నియోజకవర్గానికి చేరుకున్న ఐటీ శాఖ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం రాత్రి సొంత ఇంటిలో బస చేశారు. సోమవారం ఉదయం శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ శివపురం గ్రామంలోని ఆయన నివాసంలో స్థానిక ప్రజలను కలిసి, వారి సమస్యలను విచారిస్తూ, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ప్రజల సమస్యలపై స్పందిస్తూ, వినతులను పరిశీలించి, సంబంధిత శాఖలకు కేటాయిస్తూ, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రిని కలవడానికి వచ్చిన ప్రతి ఒక్కరితో ఫోటోలు దిగారు, పక్కనే ఉన్న చిన్నపాటి టీ కొట్టులో అందరితో కలిసి టీ తాగారు.

చాలా దూరం వెళ్ళాలి.. టీ ఇస్తావా అన్నా...

టీ కొట్టులో టీ తాగుతున్న మంత్రి నారా లోకేష్

చాలా దూరం వెళ్ళాలి టీ ఇస్తావా... అన్నా.. అన్నమాటలకు సంభ్రమాశ్చర్యానికి లోనైయ్యాడు చెంగాచారి.. టిడిపి వీరాభిమాని అయిన చెంగాచారి టీ కొట్టు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సొంత ఇంటి గృహప్రవేశ నిమిత్తం శాంతిపురం మండలం శివపురం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను చెంగాచారి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కార్యకర్త యోగక్షేమాలను విచారించారు. స్పందించిన కార్యకర్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అభిమానంతో టిడిపి కార్యకర్తగా కొనసాగుతూ, టీ కొట్టు నడుపుకొని జీవనం సాగిస్తున్నట్టు తెలిపారు. తాను టిడిపి అభిమాని కావడంతో వైసిపి హయంలో తన టీ కొట్టుని వైసిపి వారు మూసివేయించినట్టు తెలిపారు. కార్యకర్త సమస్యలను విన్న నారా లోకేష్ నువ్వు ఎవ్వరికీ భయపడనవసరం లేదు నీ వెంట నేను ఉన్నాను.. నీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నాకు ఫోన్ చేయి అని.. మనోధైర్యాన్ని కల్పించారు. అలాగే మంత్రి కుప్పం పర్యటనను ముగించుకొని, కడపలో జరుగబోవు మహానాడు కార్యక్రమంలో హాజరు కావడానికి వెళుతున్న సందర్భంగా లోకేష్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులతో కలిసి టిడిపి కార్యకర్త చెంగాచారికి చెందిన టీ కొట్టుకు వెళ్లి టీ తాగారు. తమ అభిమాన నాయకులు టీ కొట్టుకు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు ఆనందం వ్యక్తం చేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు..

ఏర్పాట్లను పరిశీలించిన చిత్తూరు ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చరిత్రలో నిలిచిపోయేలా కడపలో మహానాడును నిర్వహించనున్నట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. కడప వేదికగా ఈనెల 27, 28, 29 జరగనున్న మహానాడు ఏర్పాట్లను సోమవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు టీడీపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడపలో జరిగే ఈ మహానాడుకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న మహానాడుకు గొప్ప చారిత్రక నేపథ్యం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడును ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం తెలుగు దేశం పార్టీకి, పార్టీ శ్రేణులకు గర్వకారణంగా నిలుస్తోందని ఆయన తెలియజేశారు. కడప గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా మహానాడును జయప్రదం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు.

నిరుద్యోగ నిర్మూలనకే నూతన పరిశ్రమలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ నిర్మూలనకై నూతన పరిశ్రమలను తీసుకువస్తున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సొంతింటి గృహప్రవేశానికి విచ్చేసిన ముఖ్యమంత్రిని శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, మదర్ డెయిరీ ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని, తమ పరిశ్రమల స్థాపన ఇప్పటికే కడాతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. వారి ఒప్పందం మేరకు ఇప్పటికే ప్రభుత్వం పరిశ్రమ స్థాపనకు అవసరమైన భూమిని కేటాయించిందని, శ్రీజ పరిశ్రమ తరపున పాల ఉత్పత్తులతో పాటు పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే మదర్ డెయిరీ తరుపున 8,000 ఉద్యోగాలను సృష్టించే పండ్ల గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమలు నేరుగా రైతుల నుండి పాలు, ఉద్యానవన పంటలను కొనుగోలు చేయడం జరుగుతుందని, ఇందువల్ల గ్రామీణ రైతులు ఆర్థికంగా ఎదుగుతారని, గ్రామీణ వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. ఈ రెండు పరిశ్రమలు తమ ఉత్పత్తులను మరో 15 నుంచి 18 శాతం నెలల్లోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరినట్టు తెలిపారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో

ఎస్‌సిలకు 2221 యూనిట్లకు రూ.92 కోట్లు

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే దళితులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి జి. చిన్నయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే దళితులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొంది మాదిగ మాలలు రెండు కులాలు కూడా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిత్తూరు జిల్లాలో 954 యూనిట్లు, తిరుపతి జిల్లాలో 1267 యూనిట్లు, మొత్తం 2221 యూనిట్టకు గాను రూ.92 కోట్లు విధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా 117 షాప్స్ ఉన్నాయన్నారు. 2014- 2019 సంవత్సరం మధ్యకాలంలో రాష్ట్రంలో 7500 లక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెడితే అందులో 40వేల కోట్లు దళితుల అభివృద్ధికి కేటాయించడం జరిగిందని తెలిపారు. గతంలో నారా లోకేష్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 4 వేల కిలోమీటర్ల పైగా సిసి రోడ్లు వేస్తే ఎక్కువ శాతం దళిత గ్రామాలలో సిసి రోడ్లు వేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దళితులకు అండగా ఉన్నారని, మాదిగలు, మాలలు కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు.

అధిక పంట దిగుబడులు సాధించేందుకు రైతులు పోటీ పడి మరీ ఎరువులు వేస్తున్నారు. అయినా నష్టాలే రైతులను పలకరిస్తున్నాయి.. వెక్కిరిస్తున్నాయి. భూమిలో పోషక లోపాలు గుర్తించకుండా, వేసిన పంటలే వేయడం..అధిక మోతాదులో ఎరువులు చల్లడం వల్ల పంటలపై చీడపీడల దాడి అధికమై సస్యరక్షణ ఖర్చు పెరుగుతోంది. భూములు నిస్సారమై భవిష్యత్ లో పంటలు వేయడానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. రైతన్న ఆరుగాలం శ్రమ మట్టి పాలవుతోంది. నేలలో అంతర్లీనంగా ఉన్న పోషకాలను కాపాడుకోకుండా, భూసారం తెలుసుకోకుండా ఎలాంటి పంటలు సాగు చేసినా దిగుబడి లేక ఆర్థికంగా చతికిల పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలు చేసుకోవడం తప్పా మరో దారి లేని పరిస్థితి. మరో నాలుగు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అయితే దీనికి నెల రోజుల ముందే వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలు చేయాల్సి ఉంది. వానాకాలం పంటలు విత్తుకునే సమయానికి ఫలితాలు వస్తే అందుకు అనుగుణంగా విత్తనం, ఎరువులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. కాగా శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో భూ సార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ ఇంకా సాగుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్ మండలం, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవిబి పురం మండలాల్లో సుమారు 1.5 లక్షల ఎకరాల సాగు భూములున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఇసుక, ఎర్రమట్టి, బంక, చౌడు నేలలు అధికంగా ఉన్నాయి. ఈ డివిజన్ లో అన్ని రకాల పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నా రైతులు అధికంగా వరి, వేరుశనగ, పుచ్చ, దోస, సజ్జ, రాగి, మొక్కజొన్నలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే నేల స్వభావం తెలియకుండా అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులు పిచికారీ చేస్తున్నారు. పంటకు ఏ మేరకు ఎరువులు అవసరమో రైతులకు అవగాహన ఉండాలి. భూమిలో ఏయో పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూసార పరీక్షల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మట్టి పరీక్షలు నిర్వహిస్తే పోషక లోపాలను గుర్తించవచ్చు. తద్వారా మోతాదులో రసాయన ఎరువులు వాడితే అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు. భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. సాధారణంగా రైతులు భాస్వరం, పొటాష్ ఎరువులను మోతాదు కంటే తక్కువగాను, నత్రజని ఎరువును మోతాదుకంటే రెండు, మూడు రెట్లు ఎక్కువగాను వేస్తుంటారు. దీనివల్ల పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. నత్రజని ఎరువును అధిక వినియోగం వల్ల పూత, పిందె ఆలస్యంగా రావడం, గింజలు ఎక్కువగా తాలిపోవడం వంటివి జరుగుతాయి. పై సమస్యలన్నింటినీ అధిగమించేందుకు వ్యవసాయ అధికారులు రైతులను భూసార పరీక్షలు చేయించుకోమని ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు మండలాల పరిధిలో 5150 మంది రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించేలా లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటివరకు 90 శాతం మాత్రమే సేకరించిన మట్టి నమూనాలు తిరుపతిలోని ల్యాబ్ కు వెళ్లాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో భూసార పరీక్షలకు అంతరాయం ఏర్పడుతుంది. మరి సేకరించిన మట్టి నమూనాల ఫలితాలైనా వస్తాయా..! ఖరీఫ్ కంటే ముందే వస్తే ఉపయోగకరంగా ఉంటుందంటూ రైతులు అభిప్రాయపడుతున్నారు. భూసార పరీక్షల ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు.

త్వరలో ఫలితాలు అందుతాయి: రమేష్ బాబు, ఏడిఏ, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో మొత్తం 5 వేల మంది రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశాం. సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయి నమూనాలు తిరుపతి ల్యాబుకు చేరాయి. త్వరలోనే ఫలితాలు రైతులకు మెసేజ్లు, కార్డుల రూపంలో అందుతాయి.

మట్టి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది

ఎండీయూ ఆపరేటర్ల నిరసన

ప్రజాశక్తి- విజయపురం (నగరి): ఉపాధి ప్రశ్నార్ధకమైన ఎండీయూ ఆపరేటర్లు సోమవారం వాహనాలతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో తహశీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఉన్నఫలంగా ఉద్యోగాల నుంచి తొలగించేస్తే తాము ఏం చెయ్యాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటివద్దకే రేషన్ సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో పలు విపత్కర పరిస్థితులలో ఎండియు వాహనాల ద్వారా రాష్ట్రప్రజలకు అనేక సేవలందించామని గుర్తుచేశారు. దీని మీద ఆధారపడి అనేకమంది తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వీటిని రద్దు చేయడంతో కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సమావేశం వాయిదా వేస్తున్న ఎంపిడిఓ మోహన్ మురళి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ప్రారంభమైన కొంత సేపటికే వాయిదా పడింది. వ్యవసాయ శాఖ వివరణ ఇస్తున్న సమయంలోనే కోరం లేదని, ప్రభుత్వం రిజర్వేషన్ ప్రకారం మహిళలకు కేటాయించిన ఎంపీటీసీ, సర్పంచ్ల స్థానంలో వారి భర్తలు, కుమారులు సమావేశానికి హాజరు కావడంతో ఎంపీడీవో మోహన్ మురళి సమావేశం నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీంతో స్థానిక నాయకులు, జడ్పిటిసి సమావేశం వాయిదా వేయాలని ఎంపీడీవోకు సూచించారు. దీంతో సమావేశం వాయిదా పడింది. తర్వాత సర్వసభ్య సమావేశం ఎప్పుడు నిర్వహిస్తామన్న విషయం త్వరలోనే తెలియజేస్తామని ఎంపీడీవో తెలిపారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్ జడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వసేవలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ సతీష్

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వసేవలను సచివాలయాలు ద్వారా సక్రమంగా అందించాలని ఎంపీడీవో సతీష్ పిలుపునిచ్చారు. గంగాధర నెల్లూరు ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్లో సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కొత్త రేషన్‌కార్డులు అదేవిధంగా ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులో మార్పులు చేర్పులు పట్ల వీళ్ళైనంత మేరకు పనులు చేయాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమం పై సర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో చంద్ర పాల్గొన్నారు.

పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించండి

ఎంపీడీవో నారాయణ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామాలలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించడం చేయాలని ఎంపీడీవో నారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన సోమల దళితవాడ వద్ద మురుగునీటి కాలువ పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించిన సర్వేలను కచ్చితంగా పూర్తి చేయాలని నిర్లక్ష్యం వహించవద్దని సచివాలయ సిబ్బందికి సూచించి రికార్డులను తనిఖీ చేశారు. అలాగే 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలో తాగునీటి బోరుబావికి అవసరమైన ట్రాన్స్ఫార్మర్ సమస్య పరిష్కరించారు. ఈఓఆర్డి లక్ష్మీదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనూష, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సమాచారం లేకుండా రీ సర్వే

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలం మేలుమాయి రెవెన్యూ పరిధిలోని రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే అధికారులు రీ సర్వే చేస్తున్నారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరి ఈశ్వర్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వేతో గ్రామాలలో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మండల గ్రామస్థాయి అధికారులు రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే భూమి రీ సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో భూముల రీ సర్వే చేయిస్తోందని, ఈ సర్వేలో భాగంగా గతంలో వేయించిన సర్వే రాళ్లను తొలగించి, కొత్త సర్వే రాళ్ల వేస్తున్నారని, అలా వేసేటప్పుడు రైతులు దగ్గరే ఉండి తమ భూమికి సంబంధించిన వివరాల్ని అధికారులకు చూపించాలని తెలిపారు. అలా చూపించకపోతే అధికారులు తమ దగ్గర వున్న డేటాతో సర్వే రాళ్ల వేసే ఛాన్స్ ఉంటుందని, ఏదైనా పొరపాటు జరిగితే, రైతు తన భూమిని కోల్పోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. కనుక ఈ సర్వే జరిగేటప్పుడు రైతు అక్కడే ఉండాలని అందుకు అనుగుణంగా రీ సర్వేలు చేసేటప్పుడు రైతులకు సమాచారం అందించాలని తెలిపారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించాలి..!



రామకుప్పంలో రేషన్ డీలర్ల సమావేశం

ప్రజాశక్తి- రామకుప్పం: జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పేద ప్రజలకు నిత్యావసర సరుకులను డీలర్లు సక్రమంగా అందించాలని రాష్ట్ర టిడిపి నేతలు మునస్వామి, నారాయణ చారి, రామ్మూర్తి పేర్కొన్నారు. సోమవారం రామకుప్పంలోని ఎంపీపీ ఛాంబర్‌లో డీలర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వాహనాల ద్వారా అక్రమాలు చోటు చేసుకున్నాయని వాటిని తొలగించేందుకు కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని అమలు చేసి ప్రజలు వీలు చూసుకుని నిత్యావసర సరుకులు తీసుకోవాలన్నారు. జూన్ 1న రేషన్ షాపుల వద్ద పండుగ వాతావరణంలో సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, యూనిట్ ఇంచార్జ్ గంట్లప్ప గౌడు, జిల్లా నేత జయశంకర్, రేషన్ డీలర్లు బాబు, కృష్ణప్ప, వెంకట్రాం రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని అన్ని ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలని మండల తహశీల్దార్ సిఎస్.అనిల్ కుమార్ రేషన్ డీలర్లను ఆదేశించారు. సోమవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలంలో డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో రేషన్ షాపు తెరిచి ఉంచి పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని, అలాగే దుకాణాల్లో రేషన్‌డీలర్ పేరు, మొబైల్ నెంబర్, స్టాక్ పంపిణీ వివరాలతో బోర్డులు నిర్వహించాలని, చౌకధరల దుకాణం చిరునామా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిబిలిటీ వృద్ధులు వికలాంగులకు వారి ఇంటి వద్దనే నిత్యావసర వస్తువులను ఇవ్వాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం పంపిణీ ప్రక్రియ చేపట్టాలని డిప్యూటీ తహశీల్దార్ యుగేష్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): రేషన్ షాపుల్లో సరకులు సక్రమంగా సరఫరా చేయాలని, తూకంలో తేడా రాకూడదని తహశీల్దార్ రవికుమార్ రేషన్ డీలర్లకు హెచ్చరికలు జారీచేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. పేదలకు సరఫరా చేసే సరకులు సక్రమంగా అందించాలని ఎక్కడైనా తూకంలో తక్కువ వేస్తున్నారని, కొన్నిరోజులే ఇచ్చి మూసేస్తున్నారని ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ డీటీ, డీలర్లు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు పట్టణ చౌక దుకాణ డీలర్ల సంఘం అధ్యక్షుడుగా నరేంద్ర కుమార్‌ను డీలర్స్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలమనేరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్ల సమావేశం జరిగింది. వచ్చే నెల 1 నుంచి డీలర్ల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ ఇన్బునాధన్ సూచించారు. అనంతరం పట్టణ డీలర్ల కార్యవర్గం ఎంపిక జరిగింది. పట్టణ డీలర్ల సంఘం అధ్యక్షులుగా ఈ.నరేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా జిలాని బాష వైస్, జనరల్ సెక్రటరీగా జుబేర్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునికృష్ణయ్య, ట్రెజరర్‌గా సనావుల్లా బాష, సెక్రటరీగా రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శాంతిపురం : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలని జీవో విడుదల చేయడంపై మండల రేషన్ షాప్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శివయ్య అధ్యక్షతన డీలర్ల సంఘం అధ్యక్షులు చంద్ర ఆధ్వర్యంలో డీలర్ల సంఘం సమావేశం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆకట్టుకున్న పద్మవ్యూహం నాటకం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నంజంపేట గ్రామసమీపంలోని గార్గేయ నది ఒడ్డున వెలసిన గార్గేయ గౌరీ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో రాత్రి వేళల్లో శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి కళాకారులు ప్రదర్శిస్తున్న మహాభారత నాటకాలు భక్తులను ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సోమవారం రాత్రి పద్మవ్యూహం నాటికను కళాకారులు ప్రదర్శించగా తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజల హాజరయ్యారు. మహాభారత యుద్ధంలో అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకొని మరణించడం అత్యంత రక్తి కట్టించే విధంగా కళాకారులు ప్రదర్శించడంతో తిలకించడానికి వచ్చిన మహిళలు కంటనీరు పెట్టారు. రాత్రి 9గంటల నుండి ఉదయం 5 గంటల వరకు కళాకారులు ఏక బిగిన ప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకారులను వారి కళా ప్రదర్శనలను అభినందిస్తూ ప్రజలు కానుకలను సమర్పిస్తున్నారు.

నేడు దుకాణాలకు సెలవు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో ప్రతినెలా ఆఖరి మంగళవారం మర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో దుకాణాలకు సెలవు ప్రకటించాలన్న నిర్ణయం మేరకు మంగళవారం దుకాణాలు మూసి సెలవు ప్రకటించినట్లు తెలిపారు. దీనికి మద్దతుగా ప్రజలు కూడా సహకరించాలని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

తెలుగు భాషా రక్షణపై తీర్మానం చేయాలి

ప్రజాశక్తి- గంగవరం: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుభాషా రక్షణకు సంబంధించి తీర్మానం చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు కోరారు. ఈ మేరకు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను సోమవారం తిరుపతిలో కలిసి వినతి పత్రం అందించారు. తీర్మానాల కమిటీ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

యోగాతోనే మానసిక ఆరోగ్యం..

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ తెలిపారు. సోమవారం చలమంగళం గ్రామపంచాయతీలో జరుగుతున్న యోగాంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగస్తులు, పౌరులకు యోగాసనాల గురించి అవగాహన కలిగించి రిజిస్ట్రేషన్ చేయించాలని, శిక్షణ పొందిన యోగా వాలంటీర్స్ చేత యోగాసనాల పైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి నిర్వహించారు.

ఘనంగా గంగ జాతర

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం వల్లిగట్ల పంచాయతీలో సోమవారం గంగ జాతర ఘనంగా జరగగా అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై కర్పూర హారతులు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి మట్టి విగ్రహాన్ని నడివీధిలో ప్రతిష్టించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటల తర్వాత ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారిని నిమజ్జనం చేశారు.

పిహెచ్‌సిల్లో కాన్పులు సురక్షితం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు సురక్షితమని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని మండల పరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. సోమవారం తీర్థం గ్రామంలోని వినోద్ భార్య పార్వతికి పురుటి నొప్పులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవడంతో డాక్టర్ సురక్షితమైన కాన్పు చేశారు, వీరికి ఆరోగ్యవంతమైన మగ బిడ్డ జన్మించినట్లు తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తల్లిబిడ్డ క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

తపాలా జీవిత బీమా.. కుటుంబానికి ధీమా..

చిత్తూరు ఉప తపాలా అధికారి లక్ష్మన్న

చెక్కును అందిస్తున్న చిత్తూరు ఉప తపాలా అధికారి లక్ష్మన్న

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తపాలా జీవిత బీమా కుటుంబానికి ధీమాని చిత్తూరు ఉప తపాలా అధికారి లక్ష్మన్న అన్నారు. సోమవారం మండలంలోని ఎగువ రాగిమానుపెంట గ్రామపంచాయతికి చెందిన సైనికుడు పంగల కార్తీక్ కుటుంబ సభ్యులు వరదరాజులు, సెల్వి కుమారుడు పంగల కార్తీక్ భారత సైన్యంలో విధులు నిర్వహిస్తుండగా వీరమరణం పొందారు. ఇతను రెండు సంవత్సరాల క్రితం చిత్తూరు ప్రధాన తపాలా కార్యాలయంలో తపాలా జీవిత భీమా రూ.10 లక్షలకు చేయించుకున్నారు. అతను మృతి చెందడంతో బీమా మొత్తం రూ.11,50,053లను నామిని అయిన తల్లి అందించారు. ఈ సందర్భంగా తపాలా సూపరింటెండెంట్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తపాలా జీవిత బీమా లేదా గ్రామీణ తపాలా జీవిత బీమా చేయించుకుంటే ప్రమాదవశాత్తు ఏదైనా జరగరానిది జరిగితే పాలసీదారుని కుటుంబానికి తపాలా శాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది శ్రీనివాసులు రెడ్డి, పురుషోత్తం, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీసిన సర్పంచులు

ప్రజాశక్తి- గుడిపల్లి: స్థానిక మండలం వెలుగు కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో గుడిపల్లి, చీకటిపల్లి, కనమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచులు పలు సమస్యలపై ఏపిఎంను నిలదీశారు. గ్రామపంచాయతీల్లో సమావేశాలు నిర్వహిస్తే తమకు సమాచారం అందడం లేదని, సర్పంచుల ప్రమేయం లేకుండానే పలు పనులు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో అవసరం లేని చోట్ల సిసి రోడ్డు ఇష్టానుసారంగా వేస్తున్నారని దీని వలన ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శించారు. అంతేకాకుండా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని బోర్లు వేసినా నీళ్ల పడడం లేదని వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఎంపిడివోను కోరారు. సర్పంచులు తెలిపిన సమస్యలపై ఎంపిడిఓ స్పందిస్తూ వెంటనే విచారణ జరిపిస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి కృష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీవో రాధాకృష్ణ, ఎమ్మార్వో సీతారాం, ఎంపీటీసీలు, సర్పంచులు, శాఖల సిబ్బంది పాల్గొన్నారు

నేత్రపర్వంగా రథోత్సవం



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేతుడై దివ్యరథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామను స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర చేపట్టారు. 9గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడుని శోభాయమానంగా అలంకరించి రథంపై అధిష్టింప జేశారు. ఆశేష భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్లు రథంపై నగరవీధుల్లో విహరించారు. భక్తులు రథంపై మిరియాలతో కూడిన ఉప్పును చల్లుతూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భజన బృందాలు, కోలాట ప్రదర్శనలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయ ఆవరణంలో ఉన్న ఊంజల్ మండపానికి చేరుకున్న స్వామి వార్లు వేద పండితులు వేద మంత్రాల నడుమ నిర్వహించిన ఊంజల్ సేవలో స్వామివారు సేద తీరారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీక్షింది తన్మయత్నం చెందారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడు రాజసం

రాత్రి స్వామివారు అశ్వవాహనంపై నగరవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయాధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టర్ తరుణ్ కుమార్, వేదపండితులు నారాయణ దాశరి, గోపాలాచారి, శబరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన చక్రస్నానం మంగళవారం ఉదయం 9 గంటలకు రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలో ఉన్న స్కంధ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. అలాగే ఉదయం 6 గంటల నుంచి 7 వరకు పల్లకి ఉత్సవం 7.30 గంటల నుంచి8.30 వరకు పుష్కరిణీ వద్ద ఉభయ నాంచారులతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం జరగనుంది. సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల నడుమ ధ్వజావరోహణం కార్యక్రమం జరగనుంది దీంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

మండలానికి చేరిన రాయితీ వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలకు 819 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు సోమవారం చేరుకున్నాయి. రైతు సేవ కేంద్రాలలో రాయితీ విత్తనాలు భద్రపరిచి ప్రభుత్వం ధర ప్రకటించగానే రైతులకు విక్రయించడం జరుగుతుందని సోమల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. కాగా కె6 రకానికి చెందిన వేరుశనగ విత్తనాలు మండలానికి చేరుకున్నాయని, గత ఏడాది 1400 క్వింటాళ్లు మండలానికి కేటాయించగా ఈ ఏడాది కేవలం 819 క్వింటాళ్లు మాత్రం మండలానికి కేటాయించారని తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనాలు 812 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా గత ఏడాది 283 హెక్టార్లలో మాత్రమే సాగు చేయడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని, దీంతో ప్రభుత్వం819 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసిందని తెలిపారు. ప్రభుత్వం రాయితీ వేరుశనగ విత్తనాల అమ్మకం విధివిధానాలపై ప్రకటన చేయగానే అమ్మకాలు ప్రారంభిస్తామని ఏవో తెలిపారు.

రాయితీ వేరుశనగ విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లోకి తరలిస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సిఐ తెలిపిన సమాచారం మేరకు.. బంగారుపాలెం మండలం బోడబండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (45) ద్విచక్ర వాహనంలో పలమనేరుకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా జాతీయ రహదారి ఇందిరానగర్ వద్ద రహదారి పక్కనగల మట్టి కుప్పలకు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు ప్రథమ చికిత్స బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు తర్వాత చెన్నై ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోస్టుమార్టం చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయంలో చోరీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: సచివాలయంలో ఆధార్ లాప్టాప్, రెండు ప్రింటర్లు చోరీకి గురైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి పక్కనే ఉన్న కొత్తపల్లి గ్రామ న చివా ల యం లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఒక లాప్టాప్ రెండు ప్రింటర్లను చోరీ చేశారు. సోమవారం ఉదయం సచివాలయ ఇంచార్జ్ సెక్రెటరీ బాలరాజు సచివాలయం తలుపులకు ఉన్న తాళం కింద పడి ఉండడం గమనించిన సెక్రటరీ ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్‌కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది క్యూ టీంతో సచాలయానికి చేరుకొని వేలిముద్ర సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. సెక్రెటరీ బాలరాజు ఫిర్యాదు మేరకు సుమారు రూ.75 వేల విలువచేసే ఒక లాప్టాప్ రెండు ప్రింటర్లు చోరీకి గురైనట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రానికి చెందిన క్రిష్ణగిరి జిల్లా బర్గుర్ తాలూకా సిగరాలపల్లి తమ్మగౌడ్నర్ గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు చిన్నస్వామి (45) తమ సొంత గ్రామం నుండి నగిరి దగ్గర గేట్ పుత్తూరుకు స్నేహితుడితో బయలుదేరారు. ఆయనకు ఓ బేకరీ ఉన్నది. ఆ బేకరీని అమ్మేసి వేరే వాళ్ళకి అప్పగించడానికి వెళుతూ ఉండగా ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారి కొత్తపల్లి గ్రామం వాణిజ్య కూడలిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో చిన్నస్వామికి తీవ్రగాయాలు, అతని స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు చిన్నస్వామిని ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేందనికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి- సోమల: 60 సంవత్సరాలు పైబడి ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్న వారికి ముక్తాభారత్ కింద 100 రోజుల లోపు డేటా సేకరించి వారికి గళ్ళ పరీక్షలు చేసి సరియైన వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది డేటా సేకరణ వేగవంతం చేయాలని అడిషనల్ డిఎం అండ్‌హెచ్ఓ వెంకటప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మందులు నిల్వచేసిన గదిలో వ్యాక్సిన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ డేటా కింద ఆసుపత్రికి వైద్య నిమిత్తం వచ్చే ప్రతి ఒక్కరికి ఆధార్ మొబైల్ నెంబర్ హెల్త్ రికార్డ్ నమోదు చేయాలన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి పీఎంజేవై కార్డులు అందజేసి 5 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్, ఐదు లక్షల వరకు ట్రీట్మెంట్ ఇచ్చే పథకాన్ని వారికి తెలియజేయాలని సూచించారు. అలాగే క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు మాత్రలు ఉచితంగా ఇవ్వడమే కాకుండా వారికి డిబిటి కింద వెయ్యి రూపాయల నగదు కూడా అందిస్తున్నామని, మదర్ చైల్డ్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయాలని సిబ్బందిని కోరారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి, సిహెచ్ఓ అమర్నాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుఖవ్యాధుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సుఖవ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మాయిపల్లి గ్రామంలో ఎస్‌హెచ్‌జి మహిళ గ్రూపు సభ్యులతో సంఘమిత్ర లీలావతి ఆధ్వర్యంలో వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ, హెచ్ఐవి ప్రాణాంతకమైన వ్యాధులని, ఇవి సోకినతే వెంటనే తగిన వైద్యం చేసుకోవాలని తెలిపారు. మహిళలకు వచ్చే సుఖవ్యాధులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వాటిని నియంత్రించుకునేందుకు సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిసి శిరీష, ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, ఫీల్డ్ వర్కర్స్ లక్ష్మీ, కల్పన, వాణి, నందిని మహిళ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.